# పిచ్చివాళ్ళు

పి.వి.రత్నం



కథా నిలయం
శ్రీకాకుళం

అడ్మిట్ చేయవలసిన కేసు వివరాలు వ్రాస్తూ తలపైకెత్తాను.

"నేను వచ్చేశాను డాక్టర్! తిరిగి హాస్పిటల్‌కు పంపేశారు డాక్టర్!!" పిచ్చిగా నవ్వుతూ నిల్చుని వుంది వనజ.

ఆర్నెల్ల క్రితం చూసిన వనజకూ, ఈనాటి వనజకు తేడా ఏమీ లేదు. అదే వేషం....అదే నవ్వు....

* * *

"ముండల్లారా!....వదలండి నన్ను..చంపేస్తా మిమ్మలందర్నీ!"

పెద్ద పెద్ద కేకలు వినిపించాయి. ఓ.పి.కి ఇంకా కేసులేమీ రాకపోవటంతో పాత రికార్డులు తిరగేస్తున్న నేను తలెత్తి చూశాను. నలుగురు ఆడవాళ్ళు ఓ అమ్మాయిని బలవంతంగా లాక్కొస్తున్నారు. వాళ్ళ వెనుక ఓ ఇద్దరు మగవాళ్ళొస్తున్నారు.

ఆ అమ్మాయిని ఇప్పుడు స్పష్టంగా చూడగలుగుతున్నాను. పదిహేడేళ్ళుండ వచ్చు. సన్నగా, పొడవుగా వుంది. జుట్టు దువ్వుకొని ఎన్ని రోజులైందో అన్నట్లుగా విడిపోయివుంది. జాకెట్టు ఊడిపోయి పీలికలై వుంది. ఊడిపోతున్న చీరను సర్దుతున్న ఆడవాళ్ళను ఇష్టం వచ్చినట్లుగా తిట్ట సాగిందా అమ్మాయి.

"ఏయ్....ఎందుకు గోల చేస్తున్నావు?" గట్టిగా కోప్పడ్డాను.

"నీవెవతివే?" అంటూ నా మీద విరుచుకుపడింది.

ఇటువంటి ఎన్నో మాటలు పడక తప్పదు—సైక్రియాట్రీ ప్రాక్టీసు చేయాలంటే.

"డాక్టర్‌గారినే తిడతావటే?" ఓ ఆడమనిషి ఆ అమ్మాయి చెంప పగలకొట్టింది. నేను ఆవిడ్ని అనునయించి, పేషంటును ఓ బల్లమీద కూర్చో బెట్టమని, ఇంకో ఆవిడ ద్వారా కేసు వివరాలు తెల్సుకో సాగాను.

ఆ అమ్మాయి పేరు వనజ. వనజ తండ్రి కృష్ణయ్యగారు శ్రీకాకుళంలో ఎలిమెంటరీ స్కూల్ టీచరుగా పనిచేస్తున్నారు. తనకున్న ఆరుగురు పిల్లలలో నలుగురు ఆడవాళ్ళే అవటంతో, ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న వనజ పెళ్ళి కట్నం కోరని రెండో పెళ్ళికొడుకు మోహన్రావుతో పెళ్ళి జరిపించారు. కాపురానికి వచ్చిన వనజ మొదటి రెండు నెలలూ బాగానే వుంది. కానీ ఈ మధ్యనే పిచ్చి పిచ్చి కేకలు వేయటం, అత్తగారిని నానా మాటలు అనటం చేయసాగింది. భర్తను దగ్గరకు కూడా రానీయ లేదు. అప్పుడప్పుడు బట్టల్లేకుండా ఇల్లంతా తిరగసాగింది. ఇంట్లో వస్తువులను చిందర వందర చేయటమే కాకుండా, మోహన్రావు మొదటి భార్య కూతురు సుజాతను కారణం లేకుండా కొట్టసాగింది. ఎవరో చెప్పితే భూతవైద్యం కూడా చేయించారు. కానీ లాభం లేకపోవటంతో ఈ పిచ్చాసుపత్రికి తీసికొని వచ్చారు.

ఈ లక్షణాలన్నీ నాకో ఐడియాని కల్పించాయి. ఐనా 'డయాగ్నసిస్' ఖచ్చితంగా నిర్ధా

రించుకోబోయే ముందు ఇంకొంత ఇన్ఫర్మేషన్ తెలుసుకోవాలని, వనజ భర్తను పిలిపించాను.

"నమస్తే మేడమ్!" మోహన్రావ్ వయస్సు 30, 32 మధ్య వుంటుంది. పెరిగిన గడ్డం, మాసిన బట్టలు—అతని మానసిక సంక్షోభాన్ని తెలియజేస్తున్నాయి.

ప్రతి నమస్కారం చేస్తూ, కూర్చోమన్నాను.... చిన్నగా ఖాతా ఖాళీలో పడవేసి నాక్కావాల్సిన విషయాలు తెల్సుకోసాగాను.

* * *

మోహన్రావ్ ఏదో ప్రయివేటు కంపెనీలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఆఫీస్ టైమింగ్స్ అంటూ ఏమీలేవు. ఉదయం 8 గంటలకు ఆఫీసుకు వెళ్ళితే తిరిగి రాత్రి 9 తర్వాతే ఇంటికి తిరిగి వచ్చేది. చాలీచాలని జీతంతో విశాఖ పట్నంలో ఎలాగో కాపురం నెట్టుకొస్తున్నాడు. సంవత్సరం క్రితం మొదటి భార్య ప్రమాదవశాత్తు బావిలోపడి మరణించటంతో సుజాతను చూడటంకోసం-వనజను తన కిష్టం లేకపోయినా చేసుకున్నాడు. వనజతో మొదటి రాత్రి గురించిఅడిగినప్పుడు సిగ్గుపడ్డాడు. ఐనా సైక్రియాట్రీలో ప్రతి విషయమూ ఎంతో ఇంపార్టెంటు కనుక ఆ విషయం తెలుసుకోక తప్పలేదు. మొదటి రోజు వనజతో కొద్ది ఘర్షణ తప్పలేదుట. నెలక్రితం వరకు వనజతో ఎట్టి అభ్యంతరాలు లేకుండానే గడుపుతున్నాడు. రోజూ ఉదయాన్నే నిద్ర లేపటం—కాఫీ ఇవ్వటం దగ్గర్నుంచీ—ఆఫీసుకు వెళ్ళేవరకు తనను అంటి పెట్టుకొనే వుండేది. తనే అప్పుడప్పుడు 'సుజాతను చూస్తుండు' అని కోప్పడేవాడు. తన తల్లితో కూడా వనజ ప్రవర్తనలో మంచితనమే కనిపించేది. కానీ సుమారు నెల క్రితం నుంచే వనజ ప్రవర్తనలోని మార్పు అర్థంకాక, ఇతరుల సలహాపై ఈ ఆసుపత్రికి తీసుకొచ్చాడు.

సాయంత్రం 'రౌండ్స్' వేస్తూ ఫిమేల్ వార్డుకు వచ్చాను. 'పిచ్చి ఆసుపత్రిలో వుండే రోగులు వెకిలి చేష్టలతో, డాన్సులు చేస్తుంటారు' అని సినిమాలు బోధించే సూత్రానికి విరుద్ధంగా వుంది ఫిమేల్ వార్డు. ఎక్కువ మంది పేషంట్లు శుభ్రంగా జుట్టు దువ్వుకొని పరిశుభ్రమైన బట్టల్లో వున్నారు. కొందరు తమలో తామే మాట్లాడుకొంటుంటే, మరికొందరు తమకు కేటాయించిన పనులు చేయటంలో మునిగి వున్నారు. మరికొందరు మాత్రం బట్టల్లేకుండానే తిరుగు

తున్నారు వార్డ్‌లో.

నా కాళ్ళు ఓ మూలగా వున్న బెడ్‌పై కూర్చున్న వనజ వైపు దారి తీశాయి.

"వనజా!" అనునయంగా పిలిచాను.

"ఊఁ!" ఏదో లోకంలో వున్నట్లుగా సమాధానం.

"నా పేరు శ్యామల. ఇక నుంచి మనం ఇద్దరం స్నేహితులం. ఏం?" మంచి చేసుకోటానికి ప్రయత్నం.

నా వేపు కోపంగా తిరిగి చూపింది. కానీ ఎందుకో ఏమీ మాట్లాడలేదు.

"కేరమ్స్ ఆడుకుందామా?" ప్రేమగా అడిగాను.

"నాకు రాదు!" విసుగ్గా అంది వనజ

"పోనీ 'రింగ్' ఆడుదామా?" నా దారిలోకి తీసుకొని రావటానికి ప్రయత్నం.

కొద్దిసేపు బ్రతిమలాడి ఎలాగో కోపం పోగొట్టగలిగాను. రేపు మరలా కలుస్తానని చెప్పి వెళ్ళి పోయాను.

* * *

వారం రోజులలో వనజ నాకు చెప్పిన విషయాలు-వనజకు బాగా చదువుకొని, ఉద్యోగం చేస్తూ తన వాళ్ళందరినీ పోషించాలనీ, తన తండ్రి భారాన్ని తగ్గించాలని కోరిక. కానీ ఆ కోరికను తన తండ్రి ఆదిలోనే తుంచివేసి మోహన్రావుతో పెళ్ళి జరిపించటంతో ఎంతో దిగులు పడిపోయింది భర్తతో చెప్పి ఇంటర్ చదువుదామనుకుంది. కానీ ఇంటి పరిస్థితులు భిన్నంగా వుండటంతో ఆ 'ఆశ' వదిలేసుకుంది. అత్తగారు కట్నం తీసుకొని రాలేదని పోరుతూంటే, సుజాత ఏమో వనజను చూడగానే ఏడ్చేసేది. ఎంత సముదాయించినా పూరుకునేది కాదు. అందుకు మోహన్రావు ఇంట్లో వున్న కొద్ది సమయంలోనూ వనజనే తిట్టుతుండేవాడు. తన బాధంతా కనీసం రాత్రిళ్ళయినా మోహన్రావు వింటాడనుకొనేది. కానీ మోహన్రావు తనతో గడిపిన మొదటి రాత్రి గుర్తుకు వచ్చి, భయంతో మాట్లాడకుండా బిగుసుకు పోయేది. దానికి తోడు మోహన్రావు తన కోరిక తీర్చుకుని వెంటనే నిద్రకుపక్రమించేవాడు.

ఈ విషయాలన్నీ వనజ 'హిస్టీరియా'తో బాధపడుతున్నట్లు తెలియజేస్తున్నాయి.

వనజ లాంటి వాళ్ళు ఈ ఆసుపత్రిలో ఎంత మందో వున్నారు. హిస్టీరియా అనేది కేవలం 'ఫంక్ష

నల్ డిసీజు.' బయటి ప్రపంచం లోని ప్రభావాలను, వత్తిడులను వేరు చేసి, ఆ వ్యక్తిని ఆ శక్తులకు అనుగుణంగా మార్చితే సరి పోతుంది. ఆ ప్రకారంగానే నా ట్రీట్‌మెంటును మొదలుపెట్టాను.

వనజ మూడు నెలల కాలం లోనే మామూలు మనిషి అయి పోయింది. నేను ఇచ్చిన ప్రోత్సాహంతో ఇంటర్మీడియట్ పరీక్షకు కూర్చోటానికి కూడా సిద్ధపడు తున్నది. ఉదయం, సాయంత్రం ఆసుపత్రిలోని రోగులకు చదువు చెప్పే బాధ్యత కూడా తీసుకుంది. పేషంట్లలో చాలా మంది వనజ మాట జవదాటరు ప్రస్తుతం.

ఆ రోజు మాకు ఆనందం, దుంఖః కలిగిన రోజు. వనజను డిస్‌చార్జ్ చేసి ఇంటికి పంపే రోజు. వనజ వెళ్ళిపోతుంది అనుకోగానే నాలో ఏదో భాగం కోల్పోతున్నట్లు ఫీలయ్యాను. వనజ కల్పిపోయి నంతగా మరి యే ఇతర రోగులు నాతో కలవలేదు. నేను దగ్గరుండి వనజను కన్నీళ్ళతో బస్సెక్కించి వచ్చాను.

* * *

'మరి ఇదేమిటి? తిరిగి. అదే వేషంతో ప్రత్యక్షమైంది!' కోపం వచ్చిన మాట నిజం.

ఏడుస్తున్న వనజను ఓదార్చుతూ క్యాంటీన్ వైపుకు తీసికెళ్ళసాగాను

"అమ్మా! ఓ పావలా ఇయ్యి తల్లీ!" ఓ రోగి కాళ్ళా వేళ్ళా పడుతున్నాడు.

నాకు తెల్సు—వీళ్ళకు డబ్బు లిస్తే ఏం చేస్తారో?

'దేశంలో సోషలిజం ఎక్కడ లేకపోయినా మా మధ్య మాత్రం వుంది' అన్నట్లుగా ప్రవరిస్తారు. బీడీలు, చుట్టలు కొని అందరూ ఒకళ్ళ తర్వాత మరొకరు పీల్చు తారు.

అపుడు జరిగే తగాదాలూ.... అవీ.... అనుభవమే కనుక అతన్ని కోప్పడి కేంటీను వైపు నడిచాము.

"రండి డాక్టరమ్మా! రండి." కేంటీను గుమ్మంలో నిలబడి పిలుస్తున్నాడో వ్యక్తి.

పిచ్చి ఆసుపత్రికి వచ్చిన రోగులు తమ నాగరిక జీవితాన్ని, తమ చుట్టూ వున్న ప్రపంచాన్ని మరిచిపోకూడదని ఈ కేంటీన్ను అభివృద్ధి చేశాము. ఇందులో పని చేసేవారు డబ్బు వసూలు చేసేది-అంతా రోగులే.

ఆర్డరిచ్చిన కాఫీని చిరునవ్వుతో తీసికొచ్చాడు ఇందాకటి

గుమ్మంలో నిల్చున్న వ్యక్తి. ఇంక ఆప్యాయత ది సో కాల్డ్ పోలిష్డ్ హోటల్లోనూ దొరకదు కూడాను.

వనజ కాఫీ త్రాగకుండా ఇంటి దగ్గర జరిగిన విషయాలు చెపు తూంటే కాఫీ ఇక త్రాగాలనిపించ లేదు.

"ఇంటికి వెళ్ళిం దగ్గర్నుంచీ ప్రతివాళ్ళూ 'పిచ్చిదానా! పిచ్చి దానా! అని పిలిచేవాళ్ళు. సుజాత 'పిచ్చి పిన్నీ!' అని పిల్చేది. అయిదేళ్ళ అభం, శుభం తెలియని సుజాత కూడా 'పిచ్చి పిన్నీ!' అని పిలుస్తుంటే ఆ కోత భరించటం ఎలా? వంట చేయబోతే 'నీకేం వంట వచ్చు? నూనెకు బదులు కిరసనాయిలూ, ఉప్పుకు బదులు కారం వేసి మా ప్రాణాలు తీద్దా మనా?' అని అత్తగారు కోప్పడేది. భర్త తనను సముదాయించ వలసింది పోయి, 'ఇదో పిచ్చీ.... కాఫీ తీసుకురా!'—'పిచ్చీ! నీళ్ళు పెట్టు' అంటూ బాధించేవాడు. ఇంట్లో వాళ్ళకు లోకువ అయినపుడు బయటి వాళ్ళు ఊరుకుంటారా? ఇంటి అరుగు మీద కూర్చొంటే 'అదిగో పిచ్చిది' అని తొంగి చూసేవాళ్ళు. పిల్లలు రాళ్ళు తీసి కొని కొట్టసాగారు. ప్రదేశాల మార్పే కానీ వ్యక్తులు ఒక్కరే కనుక పుట్టింటికి కూడా వెళ్ళలేదు. నాకు ఈ హాస్పిటల్ వాతావరణమే బాగుంది మేడమ్! అందుకే తిరిగి వచ్చేశాను మేడమ్! నేను పిచ్చి దాన్ని. నన్ను మీ దగ్గరే వుండ నీయండి డాక్టర్!" భోరున ఏడుస్తోంది వనజ.

వనజ మాటలు వింటుంటే, 'నేను పడిన శ్రమ అంతా వృధా!' అని మరలా ఇంకోసారి ఋజు వయింది.

నిస్సత్తువగా కుర్చీలో వెనక్కి జారాను.

ఆలోచించ సాగాను.

'ఎవరు పిచ్చివాళ్ళు? 'నా' అన్న వాళ్ళ ఆప్యాయత కోల్పోయి, తమ చుట్టూ వున్న నాలుగు గోడల మధ్య ప్రదేశమే తమ ప్రపంచం అనుకొని, తిని ఊరకనే కూర్చొన కుండా నేతపని, కుట్టుపని, కూర గాయలు పండించటం, కేంటీను నడపటం లాంటి పనులు చేస్తున్న వీళ్ళా పిచ్చివాళ్ళు?

లేక....

పిచ్చి ఆసుపత్రిలోనికి ప్రవే శించిన రోగి పూర్తిగా వ్యాధి నయమైన తర్వాతే తమలోకి పంప బడతాడనే సంగతి తెలియని ఈ సమాజంలోని వ్యక్తులు పిచ్చి వాళ్ళా?

తమ వాళ్ళతో ఆనందంగా కాలం గడపాలనే ఆశతో ట్రీట్‌మెంటు పూర్తి కాగానే ఇంటికి పరిగెత్తే వీళ్ళా పిచ్చివాళ్ళు?

లేక....

"పిచ్చివాళ్ళు....ఎప్పటికీ పిచ్చివాళ్ళే!" అనే ముద్రతో ఆ వ్యక్తులను తిరిగి పిచ్చాసుపత్రికి పంపుతున్న ఈ సమాజం పిచ్చిదా?

ఎవరు పిచ్చివాళ్ళు???'

"మేడమ్!" అనే పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి పడ్డాను. కాదు-కాదు...పిచ్చివాళ్ళ లోకంలోకి వచ్చి పడ్డాను.


# శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద, ఫోన్ : 551, తెనాలి (ఎ.పి.)

బ్రాంచి : 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17.

దీర్ఘవ్యాధులకు వుత్తమ ఉచిత వైద్యము



హస్త ప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక్క డోస్‌తో ఎన్నడూ, కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తిచెందు స్త్రీ, పురుషులు వాడదగినది-స్వస్థులు.) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు పుచిత వైద్యం-రండి.

బ్రాంచీ: బ్రాడీపేట 5వ లైను, గుంటూరు.

బ్రాంచీలు :— తిరుపతి, నెల్లూర్లలో త్వరలో తెరువబడును.